

ప్రజల చెంతకే వైద్య సేవలు

ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు

ప్రజాశక్తి – మొగల్తూరు

ప్రభుత్వ వైద్య సేవలను ప్రతి ఒక్కరికీ చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి రాజు అన్నారు. శుక్రవారం కొత్తపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలకు మెరుగైన వైద్యాలు అందిస్తున్నామన్నారు. అనంతరం స్వయం సహాయక సంఘం సభ్యులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదని ఆరా తీశారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచి లోకం నాగలక్ష్మి నాని, జెడ్‌పిటిసి తిరుమల బాపూజీ, వైస్ ఎంపిపి కాయల సుబ్బారావు, ఎంపిడిఒ యు.బాజీరాజు, నాయకులు పాల్గొన్నారు.

జలం.. గరళం..!

- పంట కాలువలోకి ఆక్వా చెరువుల నీరు
- తాగునీరు కలుషితం
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు
- వ్యాధుల బారిన ప్రజలు



కె.లంక ఛానల్‌లోకి ఆక్వా నీరు వస్తున్న ప్రాంతాన్ని చూపుతున్న కాళ్ల గ్రామస్తులు

ప్రజాశక్తి – కాళ్ల

జిల్లాలో ప్రస్తుతం ప్రజలను పట్టిపీడిస్తున్న ప్రధాన సమస్య తాగునీరు. ఆక్వా జోన్ పేరిట వెలిసిన ఆక్వా చెరువుల వల్ల ప్రజారోగ్యం కుంటుపడుతోంది. జిల్లాలో పలు గ్రామాల్లో చేపల చెరువుల కోసం అనుమతులు తీసుకుని పలువురు అక్రమంగా రొయ్యల సాగు చేస్తున్నారు. వీటికోసం ఎటువంటి అనుమతులు లేకుండానే ఉప్పునీటి బోర్లు సైతం తవ్వేస్తున్నారు. రొయ్యల సాగులో విచ్చలవిడిగా సీడ్, మందులు వాడడం వల్ల ఆ నీరు కలుషితమవుతోంది. రొయ్యల పట్టుబడి అనంతరం ఆ నీటిని సమీపంలోని పంట కాలువలోకి వదిలేస్తున్నారు. అదే నీటిని పంచాయతీలు తాగునీటి చెరువుల్లో నింపడంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు నోరు మెదపడం లేదు. దీనికి ప్రధాన కారణం ప్రజా ప్రతినిధుల్లో 90 శాతం మంది రొయ్యలు సాగు చేస్తుండడమే.

పంట కాలువలు కలుషితం..

ఆక్వా వ్యర్థాలు పంట కాలువల్లో వదిలేయడంతో కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి. ఆకుపచ్చని రంగుతో చూసేందుకు భయానకంగా మారాయి. గత్యంతరం లేని పరిస్థితిలో ప్రజలు ఆ నీటినే తాగాల్సి వస్తోంది. పంట కాలు వలను పరిరక్షించాల్సిన ఇరిగేషన్ శాఖ అలసత్వంతో తాగునీరు కలుషితం అవుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రొయ్యల చెరువుల్లోని కలుషిత నీటిని పంట కాలువల్లో వదిలేయడంతో ఈ సమస్య తలెత్తుతోంది. ఫలితంగా వేలాది మందికి తాగు, సాగునీరు అందించాల్సిన పంట కాలువలు ప్రమాదకర రసాయనాలకు నిలయంగా మారిపోతున్నాయి.



పసర్లుగా మారిన పంట కాలువ

కాలుష్య కోరల్లో..

కె.లంక పంట కాలువ కాలుష్య కోరల్లో చిక్కుకుంది. కాళ్ల గ్రామానికి తాగునీరందించేందుకు ఈ పంట కాలువే ఆధారం. అయితే దీన్ని ఆనుకొని ఎగువ భాగంలో చేపలు, రొయ్యల చెరువులు ఉండడంతో ఆయా చెరువుల నీరు పంట కాలువలోకి వదిలేయడంతో కాలువ కలుషితం అవుతోంది. ఈ నీటినే గ్రామంలోని తాగునీటి చెరువులో నింపుతున్నారు. కలుషిత నీరు తాగి వ్యాధుల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అయినా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పదివేల మంది జనాభా నివసిస్తున్నారు. కుళాయిల ద్వారా వస్తున్న కలుషిత నీటిని తాగలేక ఇబ్బందులు పడుతున్నారు. తక్షణం అధికారులు చర్యలు తీసుకుని తమకు సురక్షిత నీరు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాగునీటి చెరువు నింపాల్సి ఉంది..

బి.సతీష్‌కుమార్, గ్రామ కార్యదర్శి, కాళ్ల

పంట కాలువ పసర్లుగా మారింది. ఈ కాలువ ద్వారా స్వచ్ఛమైన నీరు రావడం లేదు. కాలువలో పసర్ల నీరు ఉన్న దృష్ట్యా ఆ నీటిని తాగునీటి చెరువులో నింపలేదు. సురక్షిత నీటిని అందించాలని ఇరిగేషన్ ఎఇ ఫణిశంకర్ దృష్టికి తీసుకెళ్లాం.

స్వచ్ఛమైన నీటిని సరఫరా చేస్తాం

ఫణి శంకర్, ఇరిగేషన్ ఎఇ, ఉండి

కోలనపల్లి గ్రామం వద్ద ఆక్వా చెరువుల నుంచి కలుషిత నీరు పంటకాలువలోకి చేరుతోంది. ఆ నీరు దిగువకు రాకుండా అడ్డుకట్ట వేశాం. రెండు రోజులపాటు వంతులు వారీ విధానంలో తాగునీటి చెరువులను నింపుకునేందుకు స్వచ్ఛమైన నీరు అందిస్తాం.



ప్రమాదానికి కారణమైన ఐస్ ఫ్యాక్టరీ

కోపల్లె ఐస్ ఫ్యాక్టరీలో అమ్మోనియా గ్యాస్ లీక్

కంప్రెషర్ మిషన్ ఊడదీయడంతో వ్యాపించిన గ్యాస్

నలుగురు మహిళా కార్మికులకు అస్వస్థత

ప్రజాశక్తి – కాళ్ల, భీమవరం రూరల్

కాళ్ల మండలం కోపల్లెలోని ఆర్‌విఆర్ రొయ్యల ఫ్యాక్టరీ పక్కన ఐస్ ఫ్యాక్టరీలో అమ్మోనియా గ్యాస్ లీక్ ఘటన కలకలం రేపింది. ఆర్‌విఆర్ రొయ్యల ఫ్యాక్టరీ పక్కనే ఉన్న ప్రభు ఐస్ ఫ్యాక్టరీ ఐదేళ్లక్రితం మూతపడింది. శుక్రవారం ఆ ఐస్ ఫ్యాక్టరీలో సామగ్రిని తొలగించే పనులు చేపట్టారు. ఈ క్రమంలో కంప్రెషర్ మిషన్ ఊడదీయడంతో గ్యాస్ లీకైంది. సరైన జాగ్రత్తలు తీసుకోకుండా మిషన్ ఊడదీయడంతో ఆ కంప్రెషర్‌లో ఉన్న అమ్మోనియా గ్యాస్ ఒక్కసారిగా వ్యాపించింది. ఈ క్రమంలో ఐస్ ఫ్యాక్టరీకి సమీపంలో ఉన్న ఆర్‌విఆర్ రొయ్యల ఫ్యాక్టరీలో పని చేస్తున్న నలుగురు మహిళా కార్మికులు గ్యాస్ పీల్చి అస్వస్థతకు గురయ్యారు. కళ్లు తిరగడం, కళ్ల మంటలు రావడంతో వారిని ఫ్యాక్టరీ సిబ్బంది భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ప్రస్తుతానికి ప్రమాదం లేదని భీమవరం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరాస్వామి తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఫైర్ సిబ్బంది, కాళ్ల ఎస్ఐ వీరభద్రరావు పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపడుతున్నామని ఎస్ఐ చెప్పారు.



భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

మూడో దశ రీసర్వే వేగవంతం చేయాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి

ప్రజాశక్తి – భీమవరం

మూడో దశ రీసర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా కలెక్టరు కార్యాలయంలో శుక్రవారం మూడో దశ రీసర్వే స్టోన్ ప్లాంటేషన్, బిహెచ్ పిఎస్ డిస్ట్రిబ్యూషన్, రీసర్వేలోని మ్యూటేషన్ తిరస్కరణ, ఎలక్షన్స్, ఇనాం భూములు, ఎస్టైన్డ్ భూములు, సివిల్ సప్లై, అడంగల్ కరెక్షన్స్, జగనన్న కాలనీలు గృహ నిర్మాణాలు, స్థలసేకరణ, టూరిజం ప్రాజెక్ట్, స్పందన గ్రీవెన్స్, మీసేవ బియోండ్ ఎస్ఎల్ఎ, వాటర్ టాక్స్, ఒటిసి, సిసిఆర్‌సి కార్డులు, ప్రొక్యూర్మెంట్, ఒటిఎస్ రిజిస్ట్రేషన్, పిఎం కిసాన్, నరసాపురం నియోజకవర్గస్థాయిలో జరిగిన సమీక్షలో వచ్చిన సమస్యలపై అధికారుల కనబర్చిన ప్రగతి తదితర 20 అంశాలపై మండలాల వారీగా సంబంధిత డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జెసి సమీక్షించారు. సర్వే నిర్వహిస్తున్న గ్రామాల్లో ఎక్కడైనా సిబ్బంది సాంకేతిక సమస్యలను ఎదుర్కొంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. అప్పుడే పనులు వేగవంతంగా జరుగుతాయన్నారు. ఆర్‌డిఒలు ఎప్పటికప్పుడు మండల స్థాయి అధికారులతో సమీక్షించి రీసర్వే పనులు వేగవంతంగా జరిపించాలన్నారు. వ్యవసాయ భూములు, గ్రామకంఠం సర్వే సకాలంలో పూర్తిచేసి మెరుగైన ఫలితాలు తీసుకురావాలన్నారు. రైతులకు నోటీసులను సకాలంలో అందజేయకపోతే సదరు ఉద్యోగిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని జెసి హెచ్చరించారు. ప్రభుత్వ స్థలం ఎక్కడా వదలకుండా పకడ్బందీగా సర్వే పూర్తి చేయాలన్నారు. ప్రయివేట్ స్థలాల సర్వే అనంతరం యజమానులకు యాజమాన్య హక్కు పత్రాలు సకాలంలో అందజేయాలన్నారు. కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులు త్వరితగతిన అందజేసి రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోళ్లకు ఆర్‌బికెలో పూర్తిస్థాయిలో ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి ధాన్యం కొనుగోళ్లు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. జంక్ ఓటర్లు, 100 సంవత్సరాలు నిండిన వారు, మరణించిన వారి ఓట్లను ఒకటికి రెండుసార్లు పరిశీలించి చేర్పులు, మార్పులు చేయాలని, సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ కె.కృష్ణవేణి, ట్రైయినీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాథుర్, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, ఆర్‌డిఒ దాసి రాజు, డిఎస్ఒ ఎన్.సరోజ, హౌసింగ్ పీడీ డాక్టర్ ఆర్‌సి ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జెసి రామ్ సుందర్‌రెడ్డి



మాట్లాడుతున్న పివిఎల్ నరసింహరాజు

దోచుకున్న జన్మభూమి కమిటీలు

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు

ప్రజాశక్తి – పాలకోడేరు

గత టిడిపి ప్రభుత్వం హయాంలో జన్మభూమి కమిటీలు దోచుకుతిన్నాయని, వైసిపి ప్రభుత్వ హయాంలో కుల, మత, ప్రాంతం అనే భేదం లేకుండా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించినట్లు డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. పాలకోడేరులో రెండో రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మండల పరిషత్ అధ్యక్షులు భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటిరాజు), ఉపసర్పంచి దెందుకూరు వెంకటరాజు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి చంటిరాజు మాట్లాడుతూ గడపగడపకూ వెళ్తుంటే ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన వారు ఎదురొచ్చి స్వాగతాలు పలికి హారతులు పడుతున్నారన్నారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కష్టపడుతున్న పివిఎల్‌ను రాబోయే రోజుల్లో ఎంఎల్‌ఎగా గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పివిఎల్ మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసిపి ప్రభుత్వం రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి అవసరాలకు కోట్లాది రూపాయలు ఖర్చు చేసినట్లు తెలిపారు. ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేసినట్లు తెలిపారు. చంద్రబాబు అవినీతి చేసి జైలు పాలయ్యాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఇంజేటి మరియమ్మ, పాలకోడేరు సొసైటీ ఛైర్మన్ కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, వైసిపి యూత్ విభాగం మండల అధ్యక్షులు పి.వెంకటరాజు (బాబు) పాల్గొన్నారు.

టిడిపి ఎంఎల్ఎ, నేతల గృహ నిర్బంధం



పోలీసుల నిర్బంధంలో ఎంఎల్ఎ నిమ్మల

ప్రజాశక్తి – పాలకొల్లు

నారా లోకేష్‌ను కలవడానికి విజయవాడ వెళ్తున్న ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడును పట్టణ పోలీసులు శుక్రవారం పాలకొల్లులో అడ్డుకున్నారు. ఎస్ఐ ముత్యాలరావు, సిబ్బంది ఎంఎల్ఎ కారులో బయలుదేరుతుండగా ఆయన నివాసం వద్ద అడ్డుకున్నారు. ఎందుకు అడ్డుకున్నారని, తాను పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్ వెళ్లడం లేదని, కనీసం రాష్ట్రంలోని విజయవాడ, రాజమండ్రి వెళ్లే అర్హత లేదా అని ఎంఎల్ఎ ప్రశ్నించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు వైసిపికి తగిన విధంగా బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌ను కూడా రాజమండ్రి వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

భీమవరం రూరల్: టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ఎఎంసి మాజీ ఛైర్మన్ కోళ్ల

కొనసాగిన టిడిపి నిరసనలు

నాగేశ్వరరావును శుక్రవారం భీమవరం పోలీసులు గృహ నిర్బంధం చేశారు. చంద్రబాబు నాయుడును కలిసేందుకు రాజమండ్రి వెళ్తున్న లోకేష్‌ను కలవకుండా ఉండేందుకు నాగేశ్వరరావును గృహ నిర్బంధం చేసినట్లు వెల్లడైంది. ఈ సందర్భంగా కోళ్ల నాగేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అప్రజాస్వామిక విధానాలను అవలంబిస్తోందన్నారు. ప్రతిపక్ష నాయకులను నిర్బంధాలకు, అణచివేతకు గురిచేస్తోందన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని పోలీసు కేసులు, వేధింపులకు పాల్పడుతోందన్నారు. లోకేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువ గళం పాదయాత్ర సందర్భంగా తమపై హత్యాయత్నం కేసులు పెట్టారన్నారు. ఎట్టకేలకు బెయిల్ తెచ్చుకుంటే మరలా పోలీసులు గృహ నిర్బంధం చేయడం దారుణం అన్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు పట్టణ సిఐ గుత్తుల శ్రీనివాస్‌తో ఫోన్లో మాట్లాడారు. తమ పరిస్థితిని అర్థం చేసుకొని సహకరించాలని సిఐ తెలిపారని నాగేశ్వరరావు చెప్పారు.

భీమవరం రూరల్ : చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ భీమవరంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. శుక్రవారం దీక్షా శిబిరం వద్ద రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్, భువనేశ్వరి పిలుపుమేరకు మోత మోగింది కార్యక్రమం వలే రేపు రాత్రి 7 గంటలకు ప్రతి ఒక్కరి ఇంట్లో లైట్లు ఆఫ్ చేసి బయటకు వచ్చి 5 నిమిషాల పాటు సెల్ ఫోన్ లైట్ లేదా కొవ్వొత్తు వెలిగించి నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, టిడిపి పట్టణ అధ్యక్షులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, ప్రధాన కార్యదర్శి గూడూరి సుబ్బారావు పాల్గొన్నారు.

మొగల్తూరు : చంద్రబాబు నాయుడుకు మద్దతుగా మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం టిడిపి శ్రేణులు పోస్ట్ కార్డు ఉద్యమ చేపట్టారు. మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు చేపట్టిన కార్యక్రమంలో భాగంగా కెపి.పాలెంసౌత్‌లో నాయకులు అందే సత్యనారాయణ ఆధ్వర్యంలో కొబ్బరి ఒలుపు కార్మికులు రాష్ట్రపతి, గవర్నర్లకు పోస్ట్‌కార్డులు రాసి ప్రదర్శించారు. కార్యక్రమంలో చిన్ను సత్యనారాయణ, రాంబాబు, ఉప్పులూరు సూర్యనారాయణ పాల్గొన్నారు.



మొగల్తూరు : పోస్ట్ కార్డులతో ప్రదర్శన చేస్తున్న టిడిపి నాయకులు



పోలీసు నిర్బంధంలో కోళ్ల నాగేశ్వరరావు

నిరసనలపై పోలీస్ నిర్బంధం దుర్మార్గం

సిపిఎం జిల్లా కమిటీ విమర్శ

ప్రజాశక్తి – భీమవరం

ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నిరసన కార్యక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ నిర్బంధం విధించడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా విమర్శించింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మొన్న అంగన్‌వాడీలు, విద్యార్థులపై తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించిన ప్రభుత్వం, పోలీసులు నిత్యం ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలపైనా, టిడిపి ఎంఎల్‌ఎలు నిమ్మల రామానాయుడు, మంతెన రామరాజు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణను పదే పదే గృహ నిర్బందం చేయడం, బయటకు రానీయక పోవడం దారుణమని విమర్శించారు. ప్రజా ప్రతినిధులు ప్రజలను కలవడం, బయట తిరగడం నేరమా, వాళ్ల నాయకుడు లోకేష్‌ను కలవాలని వెళ్లడానికి ప్రయత్నించడం చట్ట విరుద్ధమా అని బలరాం ప్రశ్నిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నెలల తరబడి సెక్షన్ 30, వారాల తరబడి 144 సెక్షన్లు విధించి ప్రతిపక్షాల, ప్రజాసంఘాల కార్యకలాపాలను అడ్డుకోవడం, అనుమతుల పేరుతో ఆటంకపర్చడం ప్రజాస్వామ్య వ్యతిరేకమని తెలిపారు. అధికార పార్టీకి ఇవి వర్తించవా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికార పోలీసు యంత్రాంగం రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించడం సిగ్గుచేటని విమర్శించారు. మీడియాపై కేంద్ర ప్రభుత్వ దాడిని, ప్రజా ఉద్యమాలపై, ప్రతిపక్షాలపై రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ పోకడలను అందరూ ఖండించాలని విజ్ఞప్తిచేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించకుండా ప్రజలపై విపరీతమైన భారాలు వేస్తూ ప్రజా ఉద్యమాలను అణచివేయాలని ప్రభుత్వాలు ప్రయత్నించడం అవివేకమని విమర్శించారు.

ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీరు

ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి – వీరవాసరం

ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మడుగు పోలవరంలంకలో జల జీవన్ మిషన్ పథకంలో రూ.19.9 లక్షల నిధులతో నిర్మించిన పైపులైన్, సంపును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గంలో ఇంటింటికీ కులాయి కనెక్షన్ ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే మొదటి విడత జల జీవన్ మిషన్‌లో రూ.20 కోట్ల నిధులు మంజూరు కాగా నియోజకవర్గ పరిధిలో పనులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి ఇంటికీ ఉచితంగా తాగునీటి పైపులైన్ వేస్తున్నారని ఆయన తెలిపారు. గ్రామాల అభివృద్ధికి కట్టుబడి పని చేస్తున్నామని, ముఖ్యంగా రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యాలను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అనంతరం మడుగు పోలవరంలంకలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి బిపి చెక్ చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో ప్రతి ఒక్కరూ వైద్య సేవలు పొందాలన్నారు. అన్ని రకాల పరీక్షలూ శిబిరంలో ఉచితంగా చేస్తున్నారని, ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



మడుగుపోలవరంలో జల జీవన్ మిషన్ పథకాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

కోట్లా రూపాయలతో పట్టణాభివృద్ధి

భీమవరం రూరల్: కోట్లాది రూపాయలు వెచ్చించి భీమవరం పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఆరో వార్డులో రూ.39 లక్షల నిధులతో గాదిరాజువారి వీధిలో నిర్మించిన సీసీ రోడ్డును ఎంఎల్ఎ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లలో భీమవరంలో ప్రతి వార్డులోనూ ప్రజల కోరిక మేరకు సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించినట్లు తెలిపారు. కొత్తగా మరికొన్ని రోడ్ల నిర్మాణాలకు, ఇతర అభివృద్ధి పనులకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించామని, త్వరలోనే ఈ పనులకు నిధులు మంజూరవుతాయని తెలిపారు. అలాగే టిడ్కో గృహాలకు సంబంధించి అక్కడి ప్రజలు వాడిన నీటిని శుద్ధిచేసి కాలువలోకి వదిలేందుకు నిర్మిస్తున్న ఎస్‌టిపి ట్యాంక్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు.

దేవాదాయ కౌలు రైతులకు రైతుభరోసా కల్పించాలి

ప్రజాశక్తి – గణపవరం

మండలంలో దేవాలయ భూములు సాగు చేస్తున్న కౌలు రైతులకు రైతు భరోసా కల్పించాలని కౌలు రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ పి.లక్ష్మికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం మండల కార్యదర్శి పి.నరశింహమూర్తి మాట్లాడుతూ కౌలు రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలన్నారు. గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. అలాగే బ్యాంకు రుణాలు అందించి, పంటల నష్టపరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు కె.కిరణ్‌కుమార్, కైగాల శివన్నారాయణ, కౌరు రామచందరావు, ఉత్తర్ల శ్రీనివాసరావు, సత్తినీడి అన్నవరం పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతులు

మొక్కలు నాటడం అందరి బాధ్యత

ఆర్‌టిసి డిపో మేనేజర్ గిరిధర్

ప్రజాశక్తి - భీమవరం అర్బన్

ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలని ఆర్‌టిసి డిపో మేనేజర్ గిరిధర్‌కుమార్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో కెఆర్‌కెఆర్ మున్సిపల్ హైస్కూల్లో స్వచ్ఛత హి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎం గిరిధర్‌కుమార్ మాట్లాడుతూ ఇతర దేశాల్లో పెద్ద హోదా గలవారు సైతం మొక్కలు పెంచుతారని, దీంతోపాటు పరిశుభ్రత పాటించడంలో ఒక సామాజిక బాధ్యతగా నిర్వహిస్తారని చెప్పారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రతి శుక్రవారం, శనివారల్లో ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ సౌజన్యంతో 27 మొక్కలను నాటామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎ.సత్యనారాయణ, రాధాకృష్ణ పాల్గొన్నారు.


ఎంపికైన అభ్యర్థులతో లెక్చరర్లు

ఉద్యోగమేళాలో ఆరుగురు ఎంపిక

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం డిగ్రీ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన ఉద్యోగ మేళాలో ఆరుగురు అభ్యర్థులు ఎంపికైనట్లు కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి తెలిపారు. ఎంపికైన వారికి రూ.6 వేల వేతనం ఉంటుందని చెప్పారు. ఎంపికైన వారిని కాలేజీ వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, లెక్చరర్లు టి.అక్కిరాజు, ఐవిఎల్ఆర్ కె.ప్రసాద్ అభినందించారు.

గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందజేత

ప్రజాశక్తి - పెనుమంట్ర

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని నత్తా రామేశ్వరం సర్పంచి వెలగల ధర్మారెడ్డి అన్నారు. పెనుమంట్రలో గర్భిణులకు, బాలింతలకు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి మాట్లాడుతూ పౌష్టికాహారం ప్రయోజనం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీశైలపు నాగేంద్రకుమార్, అంగన్‌వాడీ టీచర్ శాంతకుమారి, ఆయా దయామణి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కోపల్లె గ్రామంలో ప్రజా సంకల్ప పాదయాత్ర కార్యక్రమాన్ని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజుశుక్రవారం నిర్వహించారు. కోపల్లె గ్రామం సాగర్లపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన మాట ప్రకారం రూ.8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు పివిఎల్.నరసింహరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పివిఎల్ నరసింహరాజు మాట్లాడుతూ కోపల్లె గ్రామంలో నవరత్నాల పథకాల ద్వారా నాలుగున్నర సంవత్సరాల్లో సుమారు రూ.7.50 లక్షలతో రోడ్లు, డ్రెయినేజీలు రూ.3 కోట్లు, మొత్తం రూ.10.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అనంతరం వేంపాడు గ్రామంలో ప్రజా సంకల్ప పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. వేంపాడు గ్రామంలో సుమారు రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని పివిఎల్.నరసింహరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి యిర్రింకి పద్మావతి, ఉప సర్పంచి వేగేశ్న సుమన్, మాజీ సర్పంచి వీరమల్లు బోస్ పాల్గొన్నారు.

15 నుంచి దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి - భీమవరం అర్బన్

భీమవరం మెంటేవారితోటలోని శ్రీ విజయ కనకదుర్గా శ్రీచక్ర సహిత బాల త్రిపుర సుందరి దేవి అమ్మవారి శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఈ నెల 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది. ఈ మేరకు ఉత్సవాలకు సంబంధించిన పుస్తకాలను శుక్రవారం ఆవిష్కరించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 23 వరకు అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు, 25న గ్రామోత్సవం, 17న అన్నదానం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

కుటుంబ కలహాలతో భార్య ఆత్మహత్యాయత్నం

పరిస్థితి విషమించి మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు

కుటుంబ కలహాలతో భార్య పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఉప్పలపు పెద్దిరాజు, శృతి దంపతులు బ్రాడీపేట శివారు హనుమాన్‌కాలనీలో నివాసం ఉంటున్నారు. పెద్దిరాజు పాలకొల్లు పట్టణంలో సెలూన్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో భార్యాభర్తలు తరచూ గొడవ పడుతుండేవారు. ఈ నెల ఐదో తేదీ గురువారం గొడవ పడటంతో మనస్తాపానికి గురైన శృతి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను కాపాడేందుకు ప్రయత్నించిన భర్త పెద్దిరాజుకు గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు, స్థానికులు శృతిని ప్రయివేట్ అసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం భీమవరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న శృతి పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందింది. భీమవరం ఆసుపత్రి నుంచి సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ ముత్యాలరావు తెలిపారు.

జూద శిబిరంపై దాడి

ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలోని కొణితివాడలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరవాసరం ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొణితివాడలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు గురువారం రాత్రి గ్రామంలో ఎస్ఐ రమేష్ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న రామరాజు, రవిశంకర్, ఉమా శంకర్‌లను పట్టుకొని వారి వద్ద నుంచి రూ.1200 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

యువతి అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి - పాలకోడేరు

యువతి అదృశ్యంపై పాలకోడేరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శృంగవృక్షం గ్రామానికి లక్ష్మీసరస్వతి ఇంటర్ చదివి ఇంటి వద్దనే ఉంటుంది. ఆమె తల్లి గల్ఫ్ వెళ్లింది. అదే గ్రామంలో ఉన్న లక్ష్మీసరస్వతి అక్క కుమారుడి అన్నప్రాసన కార్యక్రమానికి ఈ నెల నాలుగో తేదీన వెళ్లింది. అదే రోజు మధ్యాహ్నం వాష్‌రూమ్‌కి వెళ్తానని చెప్పి తిరిగి రాలేదని ఆమె బావ ప్రవీణ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే వీధిలో ఉన్న మురాల కిరణ్‌తో తరచూ మాట్లాడేదని, అతనిపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాలకోడేరు ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు తెలిపారు.

విద్యార్థులు శారీరక వ్యాయామం చేయాలి

ప్రజాశక్తి - భీమవరం అర్బన్

విద్యార్థులు శారీరక వ్యాయామం చేస్తూ చక్కని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఎఐసిటిఇ ద్వారా చేసిన సూచనల మేరకు కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో 3కె వాక్తాన్ కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాల ప్రాంగణంలోని సృజన వాటిక నుంచి కళాశాల ప్రాంగణమంతా ఫిట్ ఇండియా అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జగపతిరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానంలో విద్యార్థి చదువుతోపాటు సంపూర్ణ ఆరోగ్యాన్ని పెం పొందించుకునే వి ధంగా కళాశాల స్థాయిలో పలు కార్యక్రమాలు ని ర్వహించాలని సూ చించిందన్నారు. గతం లో జాతీయ స్థాయిలో ఎఐసిటిఇ నిర్వ హించిన ఫిట్ ఇండియా ఛాలెంజ్ పోటీల్లో రెండు విభాగాల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారని చెప్పారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం విద్యార్థులు యోగా, వ్యాయామం క్రీడలు వంటి వాటిలో శిక్షణ పొందితే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.కృష్ణచైతన్య, ఎన్ఎస్ఎస్ సహాయ కో-ఆర్డినేటర్ కెఎన్‌వి.సత్యనారాయణ, మాధవరావు, ఎన్ఎస్ఎస్ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ చట్టం తేవాలి : ఐలు



మాట్లాడుతున్న ఐలు సభ్యులు

ప్రజాశక్తి - పాలకొల్లు

న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని పలువురు డిమాండ్ చేశారు. పాలకొల్లు కోర్టు ఆవరణలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ పాలకొల్లు మహాసభ శుక్రవారం నిర్వహించారు. ఈ మహాసభకు ఐలు జిల్లా సభ్యులు కొప్పర్తి వెంకటసుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. న్యాయవాద వృత్తి ప్రమాదంలో పడిందని చెప్పారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడ్వకేట్ ప్రొటెక్షన్ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మహాసభ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. చనిపోయిన న్యాయవాదులకు బెనిఫిట్ ఫండ్ సక్రమంగా చెల్లించడం లేదని, మెడికల్ హెల్త్ కార్డులు లేనందున న్యాయవాదులు తగిన వైద్యం అందక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని చెప్పారు. కొత్తగా వచ్చిన వారికి కనీసం రూ.పది వేలు స్టైఫండ్ ప్రభుత్వమే ఇవ్వాలని, ఎస్‌సి, ఎస్‌టి జూనియర్ న్యాయవాదులకు కనీసం రూ.ఎనిమిది వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. న్యాయవాదులపై ఇటీ వల పోలీసులు పెట్టిన కేసులపై ఎఐఎల్‌యు తరపున పోరాడ తామని చెప్పారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకు న్నారు. పాలకొల్లు ఎఐఎల్‌యు అధ్యక్షులుగా కెవి.సుబ్రహ్మ ణ్యం, కార్యదర్శిగా పామర్తి నగేష్ 13 మందితో నూతన కమిటీ ఏర్పాటైంది. ఈ మహాసభలో కార్యదర్శి వి.నాగరాజు, పామర్తి నగేష్, ఎస్‌కె.రామలింగేశ్వరరావు, సిహెచ్.జయ రాజు, ఎంవి.రంగారావు, బి.సునీత, దుర్గ పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3 లక్షల ఆర్థిక సాయాన్ని వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ బాధితులకు పార్టీ కార్యాలయంలో శుక్రవారం అందించారు. పోడూరు మండలంలోని పెనుమదం గ్రామానికి అడబాల దుర్గమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స చేయించుకునేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. సమస్య గోపీ దృష్టికి వెళ్లింది. స్పందించిన గోపి సిఎం సహాయ నిధి నుంచి రూ.మూడు లక్షల చెక్కును బాధితులకు శుక్రవారం అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు గుంటూరు పెద్దిరాజు, డిటిడిసి బాబు, జిల్లా కార్యదర్శి కొండేటి రవి, జెసిఎస్ కన్వీనర్ బళ్ల రాజశేఖర్, సొసైటీ ప్రెసిడెంట్ కొర్రపాటి వీరాస్వామి, గ్రామ అధ్యక్షులు గెద్దాడ వెంకటరమణ (ఏసు), వైస్ ప్రెసిడెంట్ పితాని సత్యనారాయణ (చిన్న), ఎంపిటిసి సభ్యులు-2 చుట్టుగుళ్ల ఆంజనేయులు, పాఠంశెట్టి నాగరాజు, చెల్లిబోయిన బాబూరావు, ముచర్ల రాము, ఎం.ఆంజనేయులు, దిగమర్తి నాగరాజు, బీర రాజశేఖర్, చుట్టుగుళ్ల జయరాజ్ పాల్గొన్నారు.


సిఎం సహాయ నిధి చెక్కు అందిస్తున్న గోపీ

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

ప్రజాశక్తి - కాళ్ల

ప్రజలందరికీ ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకురావడం మంచి పరిణామమని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని పెదఅమిరం సచివాలయం-1, మండల ప్రజా పరిషత్ స్కూల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచి డొక్కు సోమేశ్వరరావు, జిల్లా వైద్యాధికారి ఉమామహేశ్వరరావు, కాళ్ల మండల వైద్యాధికారి డాక్టర్ ఎం.గులాబ్‌రాజ్‌కుమార్, డాక్టర్ ఎస్.సునీల్, ఎంపిపి శిరీష విశ్వనాథరాజు, జెడ్‌పిటిసి సభ్యులు సోమేశ్వరరావు, ఎంపిడిఒ జి.స్వాతి, కోపల్లె సొసైటీ అధ్యక్షుడు వేగేశ్న జయరామకృష్ణంరాజు పాల్గొన్నారు.


పాలకోడేరు : ఆరోగ్య సురక్ష కిట్లు అందిస్తున్న శ్రీనివాస్

భీమవరం అర్బన్ :జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతంగా జీవించాలని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని సిహెచ్‌బిఆర్‌ఎం స్కూల్లో శుక్రవారం ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్య భద్రతలకు రూ.వేల కోట్ల నిధులను ఖర్చు చేస్తున్నారన్నారు. ప్రజలు వైద్యపరంగా ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సదుపాయాలను వినియోగించుకోవాలని కోరారు. సిఎం జగన్ ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, పట్టణ కన్వీనర్ తోట భోగయ్య, జెసిఎస్ కన్వీనర్లు గాదిరాజు సుబ్రహ్మణ్యరాజు, చెల్లబోయిన సూర్యప్రకాష్, కోమటి రాంబాబు, కోడె యుగంధర్, ముత్యాల బుజ్జి, బొర్రా వాసు, పిప్పల నాని, కొప్పర్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆచంట : గ్రామీణ ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు పేద ప్రజలకు వరం లాంటిదని రాజమండ్రి రుడా ఛైర్మన్, ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. కొడమంచిలి రైతు సంఘం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఎంతోమందికి లబ్ధి చేకూరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆచంట మార్కెట్ యార్డు ఛైర్మన్ చిల్లే లావణ్య, ఎఎంసి మాజీ ఛైర్మన్ సుంకర ఇందిరా సీతారామ్, ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్, ఎంపిటిసి సభ్యులు యల్లమెల్లి బేబీ రాజేష్, ఎ.వేమవరం సర్పంచి జక్కంశెట్టి చంటి, వైసిపి నేతలు గణేషుల సుబ్బారావు, బొంతు శ్రీను, పుచ్చకాయల నాగార్జున, మన్నె సుబ్బారావు, బొక్కా మల్లేశ్వరరావు, కొండేటి లక్ష్మి పాల్గొన్నారు.

పాలకోడేరు :ప్రజా ప్రభుత్వం వైసిపి అని సర్పంచుల ఛాంబర్ మండల ప్రధాన కార్యదర్శి, విస్సాకోడేరు సర్పంచి బి.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని విస్సాకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ, అంగన్‌వాడీలు ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను పరిశీలించిన అనంతరం ఏర్పాటు చేసిన సభకు ఎంపిడిఒ మురళీగంగాధరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సర్పంచి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేయడంతో పాటు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ముఖ్యంగా ప్రజా ఆరోగ్యమే లక్ష్యంగా ప్రజలందరికీ ఆరోగ్యాన్ని అందించాలనే ముఖ్య ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. అనంతరం సొసైటీ ఛైర్మన్ గడ్డం జోషి, కో-ఆప్షన్ సభ్యులు డాక్టర్ స్వర్ణలత మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటి రాజు), మాజీ సర్పంచి పెనుమత్స శ్రీనివాసరాజు, పాపారావు, దుండి అశోక్‌బాబు, వైసిపి ముఖ్య నేతలు పిన్నమరాజు పద్మిరాజు, సహదేవరాజు, కోళ్ల ఫారం శ్రీనివాస్‌రాజు, ఉప సర్పంచి కందుల నాగరాజు, ఎంపిటిసి సభ్యులు బొల్లం గాంధీ, పేదపూడి లక్ష్మీపతి, ఉప ఎంపిపిలు ఆదాడ లక్ష్మీతులసి, నరేష్, సర్పంచులు జంగం సూరిబాబు, ఇంజేటి మరియమ్మ, కడలి విజయలక్ష్మి, సొసైటీ మాజీ ఛైర్మన్ సమంతకుడి మారాజు (బాబు), బొక్క రాంబాబు, రిచి జాన్ కిడ్స్, పంచాయతీ కార్యదర్శి జార్జ్ ప్రసాద్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉండి : ప్రతి ఒక్కరికి కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్. నరసింహరాజు అన్నారు. మండలంలోని మహాదేవపట్నం రెండో గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సందర్శించి మెరుగైన వైద్య సదుపాయాలను పొందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచి ముదునూరి సుబ్బరాజు, ఎఎంసి ఛైర్మన్ బొక్కా వెంకటేశ్వర్లు, వైసిపి మండల అధ్యక్షులు పెన్మెత్స అంజనేయరాజు, నాయకులు సాగిరాజు హరివర్మ, బాలం తులసి, గంటా కృష్ణ, బులుసు వెంకట రామకృష్ణ, గుండు నాగేశ్వరరావు, ఎంపిడిఒ అడబాల వెంకట అప్పారావు, యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

గణపవరం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదవాడికి మెరుగైన వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చిన ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందని ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) అన్నారు. మండలంలోని సరిపల్లి సచివాలయం వద్ద శుక్రవారం ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి చనుమూరి లక్ష్మీభవానిశివప్రసాద్ అధ్యక్షత వహించారు. శిబిరంలో బిపి, షుగర్, దీర్ఘకాలిక వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి, ఇఒపిఆర్‌డి పివి.సత్యనారాయణ, పిహెచ్‌సి డాక్టర్ పి.సంతోష్‌నాయుడు, డాక్టర్ చైతన్యకిరణ్, తాడేపలిగూడెం చిన్నపిల్లల వైద్య నిపుణులు దివ్యరెడ్డి, తహశీల్దార్ పి.లక్ష్మి, సిహెచ్ఒ జాలాది విల్సన్‌బాబు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : మండలంలోని చింతపల్లిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి గ్రామ సర్పంచి గుమ్మాపు పెద్దిరాజు అధ్యక్షత వహించారు. ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సంఘాని వెంకటేశ్వరరావు, టిటిడి సభ్యులు మేకా శేషుబాబు, తాతాజీ, మైకేల్‌రాజు పాల్గొన్నారు.

పెనుగొండ : మండలంలోని సిద్ధాంతం హైస్కూలులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రాజమండ్రి రుడా ఛైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి చింతపల్లి గనిరాజు (చంటి), ఎంపిటిసి సభ్యులు చిన్నం ఏడుకొండలు, గుత్తుల సత్యవతి, దామోదరం, పలివెల శ్రీను, కంకిపాటి దేవిడ్ పాల్గొన్నారు.

పోడూరు : మండలంలోని జగన్నాథపురంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గుడాల శిరీష చంటి, తహశీల్దార్ ఆర్‌వి.కృష్ణారావు, ఎంపిడిఒ డి.సుహాసిని, జెడ్‌పిటిసి సభ్యులు గుంటూరి పెద్దిరాజు, ఎంపిపి సుమంగళి సాగర్, డాక్టర్ మనిత్యాగి, డాక్టర్ సుప్రజ, డాక్టర్ నరేష్‌కుమార్, డాక్టర్ శ్రీ వాసవి, డాక్టర్ మహాలక్ష్మి, డాక్టర్ మహిధర్ పాల్గొన్నారు.


కాళ్ల : మాట్లాడుతున్న పివిఎల్ నరసింహరాజు

విద్యార్థులకు దంత పరీక్షలు

పాలకొల్లు : పాలకొల్లు ఎంఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం హెల్త్ కేర్ సెంటర్, ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో డెంటల్ ఎవర్‌నెస్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అధ్యక్షత వహించి మాట్లాడారు. దంతాలను సంరక్షించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా విచ్చేసిన డాక్టర్ మల్లుల జ్ఞానేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులకు దంతాల సంరక్షణ గురించి వివరించారు. విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్1, 2 ఆఫీసర్స్ డాక్టర్ ఎం.రామకృష్ణ, డాక్టర్ వి.విజయలక్ష్మి, బోటని విభాగాధిపతి పి.శ్రీనివాసరావు, హెల్త్ కేర్ సెంటర్ కన్వీనర్ పి.జ్యోత్స్నశ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థుల దంతాలు పరీక్షిస్తున్న వైద్యులు


ఆర్థిక సాయం అందిస్తున్న రామరాజు

వసుధ ఫౌండేషన్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పాలకోడేరు

ఇటీవల గొల్లలకోడేరులో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గరగపర్రు ఉప్పరగూడెం ప్రాంతానికి చెందిన చింతపల్లి శ్రీనివాస్ భార్య ప్రభావతికి, తీవ్ర గాయాలపాలైన అదే గ్రామానికి చెందిన చింతపల్లి మాణిక్యాలరావుకు, ఉండి మండలంలోని మహాదేవపట్నం శివారు ఉప్పరగూడెం గ్రామానికి చెందిన కాలా శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు వసుధ ఫౌండేషన్ ఆర్థిక సాయం అందించింది. ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజు దృష్టికి బాధిత కుటుంబ సభ్యుల పరిస్థితిని గ్రామ పెద్దలు పాల రాధాకృష్ణ తీసుకెళ్లారు. దీంతో బాధితులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.30 వేలు అందించారు. భీమవరం మెంటేవారితోటలో ఉన్న సుందరయ్య భవనంలో ఎంవి.రామరాజు చేతుల మీదుగా బ్యాంకు చెక్కులను శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరాజుకు పాల రాధాకృష్ణ, గ్రామ యువకులు, పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

మొగల్తూరులో అన్నసమారాధన

ప్రజాశక్తి - మొగల్తూరు

మండల కేంద్రమైన మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో ఆటో యూనియన్ సభ్యులు శుక్రవారం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. అన్న సమారాధనలో పాల్గొన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - పాలకోడేరు

ఈ నెల ఎనిమిదో తేదీ ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 33/11 కెవి మోగల్లు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు భీమవరం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ స్పీడ్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాలకోడేరు, మోగల్లు, కోరుకొల్లు, కుముదవల్లి, యండగండి, ఉనుదుర్రు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని, ఆయా గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

శిథిలావస్థకు వంతెన

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురంలో ఏలూరు కాలువపై నిర్మించిన ఆర్అండ్‌బి శాఖకు చెందిన వంతెన శిథిలావస్థకు చేరింది. గత ఎన్నికల్లో అధికార పార్టీ నేతలు ఈ వంతెన నిర్మాణానికి కృషి చేస్తామని ఇచ్చిన హామీలు నేటి వరకూ నెరవేరలేదు. జాతీయ రహదారిని ఆనుకుని ఏలూరు కాలువపై నారాయణపురం వద్ద ఉన్న ఈ వంతెన కొల్లేరు ముఖద్వారంగా చెబుతారు. గణపవరం, భీమవరం వెళ్లేందుకు ఇదే ప్రధానమైన వంతెన. బ్రిటీష్ కాలం నాటి ఈ వంతెన స్లాబు పెచ్చులూడి ఇనుప ఊచలు బయటకి కనిపిస్తున్నాయి. వంతెన పిల్లర్ వైపు నేల దిగుతోంది. చేపలు, రొయ్యలు, ధాన్యం తదితర వ్యవసాయ పంటలే కాక వాణిజ్యపరంగా భారీ వాహనాలు ఇదే వంతెన మీదుగా ప్రయాణిస్తున్నాయి. అలాంటి ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ వంతెన నిర్మాణానికి అధికారపార్టీతో సహా ప్రతిపక్ష నాయకులు కూడా గత 15 ఏళ్ల నుంచి హామీలు ఇస్తున్నా కార్యరూపం దాల్చడం లేదు. భీమవరంలో సిఎం బహిరంగ సమావేశంలో కూడా ఈ వంతెన నిర్మాణానికి నిధులు ఇస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం. ఆర్అండ్‌బి, రెవెన్యూ అధికారులు సైట్ సర్వే చేసి, కొలతలు తీసుకుని ప్రభుత్వానికి నివేదిక పంపినా కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.